# మట్టిని కాపాడితేనే మనుగడ

- దేశ వ్యాప్తంగా సాగులో మార్పు అవసరం
- ఉప కులపతి డా.నీరజా ప్రభాకర్



సదస్సులో పాల్గొన్న కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డా.నీరజా ప్రభాకర్, వక్తలు

వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 5 : మట్టిని కాలుష్యం నుంచి ఎంత కాపాడితే.. ప్రకృతి మనకు అంత సహకరిస్తుందని కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డా.నీరజా ప్రభాకర్ అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల ఆడిటోరియంలో అంత ర్జాతీయ మృత్తిక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో ఎర్ర, నల్ల రేగడి, ఇసుక నేలలు అధికంగా ఉన్నాయని, వాటి ప్రస్తుత పరిస్థితులపై వ్యవ సాయ అనుబంధ శాస్త్రవేత్తలు పరిశోధనలు మరింత పెంచాలన్నారు. సారవంతమైన నేల, ప్రకృతితోనే సమా జంలో ప్రతి జీవి మనుగడ ముడిపడి ఉందన్నారు. సార వంతమైన నేలకు తోడు జలవనరులు ఉంటేనే ఆహారం, నీరు, పర్యావరణ భద్రతకు భరోసా ఉంటుందని సూచించారు. గుప్పెడు మట్టిలో వెయ్యికోట్ల సూక్ష్మజీ వులు ఉంటాయని, ప్రధానంగా మొక్కల వేర్లు, జీవా ల్లోని సేంద్రీయ కర్బనం, భూమిపై పెరిగే అడవులు, సారవంతమైన నేలలు వాతావరణంలోని కర్బనాన్ని స్థిరీకరించి పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషి స్తాయన్నారు. కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న రసా యన సాగు విధానాలు, సేంద్రీయ ఎరువుల లభ్యత తగ్గడం, ఒకేతరహాలో పంటలు పండించడం, సాగు నీటి పద్ధతుల్లో లోపాలు, నేల కోతకు దారి తీస్తున్నాయ న్నారు. సాగు భూములు కాలుష్యానికి గురికావడంతో నిస్సారంగా మారుతున్నాయని చెప్పారు. నేల కోతను అరికట్టేందుకు కాంటూరు సేద్యం, అంతర మిశ్రమ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. వర్మి కంపోస్టు, పచ్చిరొట్ట, జీవ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యమైన నేలతోనే ఆహార ఉత్పత్తి పెరుగుతుందని నాగార్జున గ్రూప్ చైర్మన్ డా.రాజు అన్నారు. 2050 నాటికి ఆహార ధాన్యాల కొరత లేకుండా ఉండాలంటే దేశంలో పంటల మార్పిడి, కవర్ పంటల సాగు, జీవన ఎరువుల వాడకం పెంచాలన్నారు. సహజ వనరుల వినియోగానికి పరిశ్ర మలు, రైతులు సహకరించాలన్నారు. లిబర్టీ ఫౌండేషన్, ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ ఆధ్వర్యంలో జరిగిన ఈ సద స్సుకు అగ్రిఫుడ్ టెక్ సంస్థ యాజమాన్యం డా.రవిశం కర్, కోరమండల్ ఫర్టిలైజర్ సంస్థ ప్రతినిధి జీవీ సుబ్బా రెడ్డి, యూనివర్సిటీ డీన్ కిరణ్‌కుమార్, కళాశాల అసో సియేట్ డీన్ డా.ప్రశాంత్, రైతులు నాగరత్నం నాయుడు, పద్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మాధవ రెడ్డి, సైదయ్య, లక్ష్మీనారాయణ, సురేశ్ రెడ్డి, నిఖిల్, శ్రీరా ములు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## కేసీఆర్‌ను కలిసిన సతీష్‌రెడ్డి

బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను మంగళవారం టీఎస్ రెడ్కో మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ సతీష్‌రెడ్డి మర్యాదపూర్వ కంగా కలిశారు. – సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ )

## కందిమళ్లకు ప్రతిభా పురస్కారం



డాక్టర్ కందిమళ్ల సాంబశివరావుకు చాట్ల శ్రీరాములు ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 5 : రసరంజని, చాట్ల శ్రీరాములు థియే టర్ ట్రస్టు సంయుక్తాధ్వర్యంలో నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యా లయం ప్రాంగణంలోని ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం చాట్ల శ్రీరాములు 92వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. చాట్ల శ్రీరాములు ప్రతిభా పురస్కారాన్ని 2023కు గాను రంగస్థల నటుడు, రచయిత, పరిశోధ కుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావుకు ప్రదానం చేసి సత్కరించారు. పుర స్కారం కింద రూ.15వేలు నగదు, శాలువా, జ్ఞాపికను ప్రదానం చేశారు. తెలు గువర్సిటీ వీసీ ఆచార్య టి.కిషన్‌రావు, నాటకరంగ ప్రముఖులు డాక్టర్ డీఎస్ ఎన్ మూర్తి, తనికెళ్ల భరణి, బీఎం రెడ్డి, చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్టు కన్వీ నర్ ముట్నూరి కామేశ్వరరావు తదితరులు పాల్గొని నాటక రంగానికి చాట్ల శ్రీరా ములు చేసిన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా యువభేరి థియేటర్ సంస్థ ఆధ్వర్యంలో అక్కల తామేశ్వరయ్య రచించిన బూడిద హాస్య నాటిక వి.సత్యనారాయణ దర్శకత్వంలో వేదికపై పలువురు కళాకారులు ప్రదర్శించారు.

## 17, 18 తేదీల్లో చలో ఢిల్లీ

ఎస్సీ వర్గీకరణపై కాలయాపన వద్దు : పిడమర్తి రవి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి తదితరులు

ఖైరతాబాద్, డిసెంబర్ 5 : కమిటీల పేరుతో ఎస్సీ వర్గీకరణను కాలయా పన చేయవద్దని, ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చా లని డిమాండ్ చేస్తూ ఈ నెల 17, 18 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థా పకుడు డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళ వారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దళిత జనాభాలో 75 శాతం మాదిగలు (50 లక్షలకు పైగా)ఉన్నా రని, రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం జనాభా దామాషా ప్రకారం ఎస్సీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ప్రభుత్వ పద వులు, నామినేటెడ్ పోస్టులు 75 శాతం కేటాయించాలని, ప్రతి జిల్లా యూని ట్‌గా మాదిగలకు పదవుల్లో అవకాశం కల్పించాలన్నారు. వర్గీకరణ ప్రక్రియను తక్షణమే ప్రారంభిస్తామని చెప్పిన ప్రధాని మోదీ ఈ పార్లమెంట్ సమావేశా ల్లోనే బిల్లును ఆమోదింపచేయాలన్నారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి మాదిగలు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాదిగ రాజ కీయ వేదిక అధ్యక్షుడు ఒక్కలగడ్డ చంద్రశేఖర్, గజ్జెల కాంతం, మల్లికార్జున్, నర్సింగ్‌రావు, మొగిలయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాదిగలకు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ నేతలు

- తక్షణమే 6 గ్యారెంటీలు అమలు చేయాలి
- ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి

రవీంద్రభారతి,డిసెంబర్ 5 : రాష్ట్రంలో కొత్తగా ప్రభు త్వాన్ని ఏర్పాటు చేయబోయే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మాదిగ కులానికి చెందిన నేతకే ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ నేతలు డిమాండ్ చేశారు. ఇన్ని రోజులు దొరల తెలంగాణ అని నీతులు చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెడ్లను ముఖ్యమంత్రిని చేయడం.. దయ్యాలు వేదాలు వల్లించి నట్లే అవుతుందన్నారు. తక్షణమే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లి కార్జున్ ఖర్గే రాష్ట్రంలో మాదిగ కులానికి చెందిన ఎమ్మె ల్యేకు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలన్నారు. మంగళ వారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారం కోసం.. బీఆర్ఎస్ ప్రభుత్వం దళితున్ని ముఖ్య మంత్రి చేయలేదని గగ్గోలు పెట్టి, తీరా అధికారం వచ్చాక సామాజిక న్యాయం పాటించకుండా రెడ్లను ముఖ్య మంత్రి చేశారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కమ్మలు, రెడ్లు మాత్రమే ముఖ్యమంత్రులు అయ్యారని, తెలంగాణ రాష్ట్రంలో కూడా రెడ్లనే ముఖ్యమంత్రులను చేశారని... కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం ఎక్కడ పాటిస్తున్నదని దుయ్యబట్టారు. ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. ఎన్నికల వాగ్దానంలో ఇచ్చిన 12 లక్షల దళిత బంధు పథ కాన్ని అమలు చేయాలన్నారు.

మాదిగ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అధికార దాహంతో ప్రజలకు లేనిపోని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. లేకుంటే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. మీడియా సమావేశంలో తెలంగాణ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఇటిక రాజు మాదిగ, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు జున్ను రాజు మాదిగ, జాతీయ అధ్యక్షుడు వేముల బల్‌రామ్ మాదిగ, గోపి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సింథటిక్ కెమిస్ట్రీపై ఐఐసీటీలో అవగాహన సదస్సు

ఐదు నెలల పాటు జరిగిన సదస్సులో పాల్గొన్న పీజీ విద్యార్థులు



సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : సింథ టిక్ కెమిస్ట్రీపై ఐదు నెలల పాటు సాగిన ఓరియంటేషన్ సదస్సు ముగిసింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమి కల్ టెక్నాలజీలో జరిగిన ఈ సదస్సులో ఆర్గానిక్ కెమిస్ట్రీ చదువుతున్న విద్యార్థులకు ఐఐసీటీ సైంటిస్టులు అవగా హన కల్పించారు. ఇటీవల కాలంలో ఆర్గానిక్ కెమిస్ట్రీ చదువుతున్న విద్యార్థులకు వరుసగా ఐఐసీటీలో అవగా హన కల్పిస్తుండగా.. తాజాగా చేపట్టిన ఓరియంటేషన్ సదస్సులో పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు ఉండాల్సిన నైపుణ్యాలపై అవగాహన కల్పిం చారు. అడ్వాన్స్ సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ అవసరం, రసాయనిక రంగంలో ఉన్న ప్రాధాన్యత అంశాలపై విద్యా ర్థులకు అవగాహన కల్పించారు. వ్యాక్సిన్ తయారీలో ఐఐసీటీ ముఖ్య భూమికను పోషించిన నేపథ్యంలో ఇండస్ట్రీ, అకాడమీలను సమన్వయం చేయడంలో భాగంగా ఈ తరహా ఓరియంటేషన్ సదస్సులను నిర్వ హించినట్లుగా ఐఐసీటీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఐఐసీటీ చేపడుతున్న పలు ప్రాజెక్టులకు విస్తృత స్థాయిలో కెమిస్ట్రీ పూర్తి చేసిన మానవ వనరులు అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ఓరియంటేషన్ తరగతులతో విద్యార్థు లలో ఇండస్ట్రీ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి తోడ్పడుతాయని పేర్కొన్నారు.

## నేటి యువతరం పైనే.. సమాజ భవిత

'డియర్ ఫస్ట్ టైం ఓటర్స్ - యూత్ మీటింగ్'లో వక్తలు



సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలం గాణ): సమాజ భవితవ్యాన్ని మార్చే సత్తా యువ తరానిదేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. యువతే.. భవిత సీబీఎన్ ఫోరం విజన్– 2047 ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్‌ఆర్ గార్డె న్స్‌లో గురువారం 'డియర్ ఫస్ట్ టైం ఓటర్స్– యూత్ మీటింగ్' సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటిసారి ఓటేసిన వారికి అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, విజన్ 2047 సీబీఎన్ ఫోరం అధ్యక్షుడు జీనెక్స్ అమర్, జీవీ ఆంజనేయులు, డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, గ్రీష్మ, డాక్టర్ పొగాకు జయరాంచందర్ పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న కిడ్స్ ఫ్యాషన్ షో



కిడ్స్ ఫ్యాషన్ షోలో ర్యాంప్ వాక్ చేస్తున్న చిన్నారులు

బంజారాహిల్స్, డిసెంబర్ 5 : బంజారాహిల్స్ రోడ్ నం.10లోని లకోటియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎవాల్వ్ పేరుతో నిర్వహించిన కిడ్స్ ఫ్యాషన్ షో ఆకట్టుకున్నది. ముద్దులొలికే చిన్నారులు ఆత్మవిశ్వాసంతో విభిన్న మైన డిజైన్లతో డ్రెస్సులు ధరించి ర్యాంప్ వాక్ చేశారు. ఇనిస్టిట్యూట్ ఫ్రెషర్స్ డే –2023 వేడుకల్లో భాగంగా ఈ ఫ్యాషన్ షో నిర్వహించారు.